సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 18 । జనవరి । 2025



మలేరియా నిర్మూలనకు చర్యలు
మలేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు చేపట్టాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. IIలో



ప్రజాచైతన్యమే లక్ష్యం IIలో
ఏజెన్సీ ప్రజలను చైతన్య పరచడమే తమ లక్ష్యమని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.



ఘనంగా క్షీరాభిషేక సేవ
విశాఖ నగరంలోని బురుజుపేటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘం, సర్వసభ్య సమావేశాలు
మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్ సమీపంలోని వీసీ హాలులో, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని చెప్పారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి సర్వసభ్య సమావేశం కొనసాగుతుందని, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు 'నవోదయ' ప్రవేశ పరీక్ష
మాడుగుల: ఉమ్మడి విశాఖ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం జరగనుందని జవహర్ నవోదయ విద్యాలయం (కొమ్మాది) ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరగనుందన్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఇప్పటికే మూడు జిల్లాల పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లకు, పరిశీలకులకు మూడు జిల్లాల డీఈవో కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష రాసేందుకు 9,080 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. విశాఖ జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో 15 కేంద్రాలు, అల్లూరి జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు మొత్తం 39 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్స్, కేంద్ర స్థాయి పరిశీలకులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారు. నవోదయ విద్యాలయం ద్వారా మొబైల్ స్క్వాడ్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి జి.భక్తవత్సలం కూడా ఉన్నారు.

తమిళనాడు ఉన్నతాధికారి మత్స్యగుండం సందర్శన



మత్స్యగుండంలో గోపాల్‌కు ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు/హుకుంపేట: మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామివారిని శుక్రవారం తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.గోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.మత్స్యగెడ్డ వద్ద మత్స్య దేవతలకు ఆహారం అందించారు. ఆలయ విశిష్టతను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించి, ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తమర్బ బాబూరావు, స్థానిక జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, సర్పంచ్ మఠం శాంత కుమారి, ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పాడేరులో మోదకొండమ్మతల్లి ఆలయాన్ని తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.గోపాల్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

వలిసె వికాసం

- చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విస్తృత పరిశోధనలు
- ఆరేళ్లుగా నిమగ్నమైన శాస్త్రవేత్తలు
- మరో రెండు మూడేళ్లలో గిరి రైతుల చెంతకు ఫలితాలు
- వెల్లడించిన ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

గిరిజన రైతులకు మంచి ఆదాయం ఇవ్వడంతోపాటు, పర్యాటక రంగంలో కీలకపాత్ర పోషించే వలిసె సాగుకు మంచి రోజులు రానున్నాయి. శాస్త్రీయ వంగడాలు అందుబాటులో లేకపోవడం వల్ల నష్టపోతున్న గిరి రైతులకు మేలైన వంగడాలను అందుబాటులోకి తెచ్చే దిశగా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆరేళ్లుగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. మరో రెండు మూడేళ్లలో రైతులకు అందుబాటులోకి తెచ్చేలా ఇక్కడి శాస్త్రవేత్తలు శ్రమిస్తున్నారు.



వలిసె పైరు కోతలో నిమగ్నమైన కూలీలు



వలిసె పంటను ఆశించిన ఆకాశపందిరి కలుపు మొక్క

చింతపల్లి: గిరిజన రైతులకు వలిసెలో అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందించేందుకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పంటను జిల్లాలో వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. వీరికి ఇప్పటివరకు శాస్త్రీయమైన వంగడాలు అందుబాటులో లేవు. దీంతో దేశవాళీ రకాలను మాత్రమే సాగుచేస్తున్నారు. ఈ రకాలపై ఆకాశపందిరి



ఆకాశపందిరి కలుపు మొక్క వల్ల దెబ్బతిన్న వలిసె పైరు



చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం క్షేత్రంలో కోతకు సిద్ధంగా ఉన్న వలిసె పంట

(కలుపు) ప్రభావం ఎక్కువగా ఉన్నందున దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇటువంటి సమస్యలను గుర్తించిన శాస్త్రవేత్తలు మేలైన వంగడాలను అందుబాటులోకి తెచ్చేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా దేశంలో ఆరు పరిశోధన స్థానాల్లో విస్తృత పరిశోధనలు జరుగుతుండగా వీటిలో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కూడా ఉంది.

- పరిశోధన స్థానంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి తీసుకువచ్చిన జీఎస్ఎస్ 6, జీఎస్ఎస్ 28, జీఎస్ఎస్ 30, కేజీఎన్-2 రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. వీటితోపాటు గిరిజన రైతులు స్థానికంగా సాగు చేస్తున్న సీటీపీఎన్-1, సీటీపీఎన్-2 రకాలతోపాటు ఒడిశా నుంచి తీసుకువచ్చిన ఉత్కల్ రకంపై కూడా పరిశోధనలు చేస్తున్నారు.



చింతపల్లి పరిశోధన స్థానంలో సాగులో ఉన్న వలిసె పైరు

మేలైన దిగుబడి..

- జీఎస్ఎస్-6 రకం 110 రోజులు, జీఎస్ఎస్-28 రకం 100 నుంచి 110 రోజులు, జీఎస్ఎస్- 30 రకం 110 రోజులు, కేజీఎన్ రకం 100 నుంచి 110 రోజుల్లో దిగుబడి వస్తున్నట్టుగా శాస్త్రవేత్తలు ప్రాథమికంగా గుర్తించారు. వీటి నిర్ధారణకు మరికొన్ని సంవత్సరాల వ్యవధి పట్టే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.
- జీఎస్ఎస్-6 రకం మూడు నుంచి 4 క్వింటాళ్లు, జీఎస్ఎస్-28, జీఎస్ఎస్-30 రకాలు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు, కేజీఎన్ రకం ఎకరాకు 4 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని వారు పేర్కొన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న రకాలతో పోలిస్తే వీటి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని వారు తెలిపారు.
- గిరిజన రైతులు ఎటువంటి ఎరువులు వినియోగించకుండా వలిసెను సాగు చేయడం వల్ల వీటి గింజల ద్వారా తయారుచేస్తే నూనెకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్లో కిలో రూ.90 నుంచి రూ.100 వరకు కొనుగోలు చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో సాగయ్యే ఈ పైరు ప్రస్తుతం సుమారు 900 హెక్టార్లకు తగ్గిపోయింది. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి మెరుగ్గా లేనందున జిల్లాలో సాగు విస్తీర్ణం

పర్యాటకరంగంలో కీలకపాత్ర
జిల్లాలోని పర్యాటక రంగంలో వలిసె సాగు కీలకపాత్ర పోషిస్తోంది. ఏటా నవంబర్ నుంచి పర్యాటక సీజన్ ప్రారంభం అవుతోంది. అదే సమయంలో వలిసె పైరు పూతకు వస్తుంది. భూమికి పచ్చని రంగేసినట్టుండే ఈ తోటలు సందర్శకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. రానురాను సాగు విస్తీర్ణం తగ్గపోతున్నందున ఈ అందాలు కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంటోంది.



చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

ఏడాది ఏడాదికి తగ్గిపోతోంది. అగ్రి టూరిజంలో భాగంగా ఈ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కార్యాచరణ రూపొందించినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఆశాజనకంగా దిగుబడి లేకపోవడం వల్లే సాగు పట్ల ఆసక్తి చూపలేకపోతున్నామని రైతులు తెలిపారు.

రెండు మూడేళ్లలో అనువైన రకాల పంపిణీ



వలిసెలో అధిక దిగుబడి నిచ్చే వంగడాలు రైతులకు అందబాటులోకి తెచ్చేందుకు 2018 నుంచి తమ పరిశోధన స్థానంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిలో జంబల్‌పూర్ పరిశోధన స్థానం నుంచి తీసుకువచ్చిన జీఎస్ఎస్-6, జీఎస్ఎస్-28, జీఎస్ఎస్-30, కేజీఎన్-2, ఒడిశా నుంచి తీసుకువచ్చిన ఉత్కల్ రకంపై పరిశోధనలు చేస్తున్నాం. గిరిజన రైతులు సాగు చేస్తున్న స్థానిక వంగడాల పంటకాలం, దిగుబడులను పరిగణనలోకి తీసుకుంటున్నాం. రెండు మూడేళ్లలో ఈ ప్రాంతానికి అనుకూలమైన రకాలను చింతపల్లి నైజర్-1, చింతపల్లి నైజర్-2 పేరిట విడుదల చేసే అవకాశం ఉంది.

– డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఏడీఆర్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, చింతపల్లి

ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొవాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జేసీ ఆదేశించారు.

పులి ఆచూకీకోసం ట్రాప్ కెమెరాలు
- సప్పర్ల అటవీ ప్రాంతంలో అమర్చిన అధికారులు



కెమెరాలను అమర్చుతున్న అధికారులు

సీలేరు: స్థానిక అటవీ రేంజ్ పరిధి సప్పర్ల అటవీ ప్రాంతంలో ఇటీవల పెద్దపులి సంచరించిన ప్రాంతంలో స్థానిక అటవీ అధికారులు శుక్రవారం ట్రాప్ కెమెరాలు అమర్చారు. ఒడిశా నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన పెద్దపులి స్థానికంగా సంచరిస్తుందన్న సమాచారం మేరకు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా దాని ఆచూకీ తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలను చెట్లకు అమర్చుతున్నామని వారు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీలేరు రేంజ్ అధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది కలిసి పులి సంచరిస్తున్న ప్రాంతానికి పరిసర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పులి కంటపడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, ఎటువంటి హాని కలిగించవద్దని సూచిస్తున్నారు.

పాడేరులో మోదమ్మ తీర్థం రేపు
సాక్షి,పాడేరు: పాడేరులోని మోదకొండమ్మతల్లి ఒక రోజు తీర్థమహోత్సవాన్ని ఈనెల 19న నిర్వహించేందుకు ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం ఊరేగింపు ఉంటుంది.

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: ప్రజలను మాయ మాటలతో కూటమి ప్రభుత్వం వంచించిందని పాడేరు ఎమ్మెల్యే మత్సరాస విశ్వేశ్వరరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన మండలంలోని అన్నవరం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా సోమవరం గ్రామంలో ముందుగా అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయ మాటల చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు గాలిలో కలసి పోయాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాయ మాటలతో మోసం చేయడం తప్పితే ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ పాంగి సన్యాసిరావు, తమ్మెంగులు, కుడుముసారి సర్పంచులు సలిమితి లక్ష్మయ్య, ఆగురు కోటిబాబు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సాగిన గంగన్నపడాల్, సుంద్రు చిన్నబ్బాయి, వనగల బెన్నిబాబు, మహేష్, కృష్ణ,భీమరాజు పాల్గొన్నారు.



అన్నవరం పంచాయతీ సోమవరం గ్రామంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ
సాక్షి,పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయ వార్షిక క్యాలెండర్‌ను ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు. వర్తక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

వణికిస్తున్న చలిగాలులు
- దట్టంగా మంచు
- జి.మాడుగులలో 10.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు



చింతపల్లిలో భారీగా కురుస్తున్న పొగమంచు

చింతపల్లి: మన్యంలో పొగమంచు, చలి తీవ్రత కొనసాగుతోంది. గురువారం జి.మాడుగులలో 1.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం పాడేరు డివిజన్ పరిధి అనంతగిరిలో 10.7 డుంబ్రిగుడలో 11.4, ముంచంగిపుట్టులో 11.5, అరకులోయలో 11.7 ,హుకుంపేటలో 12.2, పెదబయలులో 12.2, పాడేరులో 13.2, గూడెంకొత్తవీధిలో 13.4, చింతపల్లిలో 14.1, కొయ్యూరులో 14.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు. ఉదయం 10 వరకు మంచు అధికంగా కురవడంతో హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తున్నాయి.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమీక్షిస్తున్న పీవో కట్టా సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో కొండరెడ్డి గిరిజనులకు మంజూరైన గృహాలను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పీఎం జన్‌మన్ గృహాలపై సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో మంజూరైన ఇళ్ల, పనులు ప్రారంభించిన వాటి వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాలకు అవసరమైతే ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 30 నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో గృహాలు పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 15 నాటికి అన్ని మండలాల్లో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్ల నిర్మాణం ప్రగతిపై ఆరా తీశారు. గృహాలకు సంబంధించి రెవెన్యూ పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు రామృకృష్ణ, . శ్రీనివాసరావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, విశ్వనాథ్, రత్నకుమారి, ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ఘనంగా భారీజం



వేషధారణల్లో చిన్నారులు, పెద్దలు



పురాతన కత్తులు చేతబూనిన చిన్నారులు


సాక్షి,పాడేరు: మండలంలోని మినుములూరులో శుక్రవారం భారీజం పండగను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. పలు వేషధారణల్లో గిరిజన చిన్నారులు, సంక్రాంతి బుడియా నృత్యాలతో పెద్దలు సందడి చేశారు. సంప్రదాయ నృత్యాలు,కత్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



మినుములూరులో భారీజం పండగ సందర్భంగా థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

కిక్కిరిసిన చాపరాయి.. కొత్తపల్లి కిటకిట







ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారి సందర్శకులతో కిక్కిరిసిపోయింది. శుక్రవారం భారీగా తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. గత శుక్రవారం నుంచి పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. గిరిజనుల వస్త్రధారణలో మహిళలు, చిన్నారులు ముస్తాబై ఫొటోలు దిగారు. జలపాతంలో స్నానాలు చేస్తూ రోజంతా ఉల్లాసంగా గడిపారు.

– డుంబ్రిగుడ



కొత్తపల్లి జలపాతం సందర్శనకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తున్నారు. శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో అత్యధికంగా తరలిరావడంతో సందడి నెలకొంది. నీటి ప్రవాహంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

– జి.మాడుగుల

వాల్తేర్ డివిజన్‌కు ఆరు అవార్డులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్‌కు వివిధ విభాగాలలో కనబర్చిన ఉత్తమ ఫలితాలకు గాను ఆరు అవార్డులను (ఆరు రన్నింగ్ ఎఫిషియన్సీ షీల్డ్‌)లను అందుకోనుంది. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ప్రధాన కారాలయం నుంచి ప్రకటన వెలువడింది. 69వ రైల్వే వారోత్సవాల సందర్భంగా ఈ నెల 31వ తేదీన జనరల్ మేనేజర్ చేతుల మీదుగా వాల్తేర్ డివిజన్ అధికారులు అందుకోనున్నారు. సివిల్ ఇంజినీరింగ్, కమర్షియల్, మెడికల్, సెక్యూరిటీ, స్టోర్స్ విభాగం, ట్రాక్ మెషీన్ వంటి ఆరు విభాగాలలో వాల్తేర్ డివిజన్ ఈ షీల్డ్‌లను గెలుచుకుంది. ఓవరాల్ విజేతను వేడుకలు జరిగే రోజున ప్రకటించనున్నారు.

ఘనంగా ఐఐఎం వ్యవస్థాపక దినోత్సవం



భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ కామత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో 240 ఎకరాల విస్తర్ణంలో ఉన్న ఐఐఎం క్యాంపస్‌లో 11వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి. కామత్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఫల్యాల ద్వారా పాఠాలు నేర్చుకోవచ్చన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ అనే నినాదంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని చెప్పారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో ఐఐఎం ఎన్నో మైలు రాళ్లను దాటిందని, అధిక నాణ్యత గల విద్యను అందించడలో ప్రఖ్యాతిని పొందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సభ్యురాలు మాళవిక, హరిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ నియామక పరీక్షలు



లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ నియామకాల కోసం అభ్యర్థులకు శరీరకదారుడ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కైలాసగిరి పోలీస్ క్రీడా మైదానంలో గత నెల 31న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షలకు 600 మందికి గాను 333 మంది అభ్యర్థులు హాజరైనట్టు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. వారికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ఆయా పరీక్షల్లో 258 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులై తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్టు తెలిపారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయం



గౌరీపరమేశ్వరుల అమ్మవారు



విద్యుత్ లైటింగ్



వేల్పులవీధి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన అయోధ్య రామాలయం సెట్

గౌరమ్మ ఉత్సవానికి వేళాయె...

- నేడు గౌరీపరమేశ్వరుల మహోత్సవం
- ప్రత్యేక పోలీస్ బందోబస్తు, ఏర్పాట్లు పూర్తి
- 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతి పండుగ ముగిసిన అనంతరం మూడో శనివారం నిర్వహించే ఈ ఉత్సవాలు సందర్భంగా ఇప్పటికే పట్టణ ప్రాంతం విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతోంది. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివసించే వారు అమ్మవారి ఉత్సవాన్ని తిలకించేందుకు ఏటా వస్తుంటారు. ఇక్కడ వేల్పులవీధిలో 171 సంవత్సరాల క్రితం వేల్పులవారి స్వగృహంలో గౌరమ్మ వెలసింది. దివంగత కొమ్మాన నర్సింగరావు తన భార్య పార్వతమ్మపై ప్రేమతో 1920లో ఓ పాకలో అమ్మవారిని ప్రతిష్ఠించాడు. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ మూడో వారంలో వేల్పులవీధి కుటుంబీకులు అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేవారు. అమ్మవారి ఉత్సవం వేల్పులవీధికి పరిమితం కాకూడదని వీధి పెద్దలు దివంగత వాకాడ దాలెప్ప, రొంతు ఆదినారాయణ, బోయిన రమణ తదితరులు నిర్ణయం మేరకు పట్టణవాసులు ఏటా జనవరి మూడో శనివారం నిర్వహిస్తున్నారు. 2005లో మెయిన్ రోడ్డు విస్తరణలో అమ్మవారి పాతగుడి దెబ్బతిన్న కారణంగా స్థానికులు, భక్తులతో 2022లో కొత్త ఆలయాన్ని నిర్మించారు.

అమ్మవారి ఊరేగింపు....

మొదట్లో వేల్పులవీధిలో మాత్రమే అమ్మవారిని ఊరేగించేవారు. ప్రస్తుతం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం అనకాపల్లి వీధుల్లో ఊరేగింపు ప్రారంభమై సోమవారం తెల్లవారు జామున స్థానిక శారదానదిలో అనుపుతో ముగిస్తారు. ఈ మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.



విద్యుత్ లైటింగ్

నేలవేషాలు...

రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన కళాకారులతో పాటు ఒడిశా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో నేల వేషాలు, చిడతలు, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. ఈ మేరకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకునే కలర్‌ఫుల్ మందుగుండు...

గౌరమ్మ ఉత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సీతారామయ్య మందుగుండు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. వివిధ ఆకృతులు ఏర్పాటు చేసి... వాటికి మందుగుండు అమర్చి చేసే విన్యాసాలు కచ్చితంగా చూసి తీరాల్సిందే. సుమారుగా రెండు గంటల పాటు కలర్‌ఫుల్ మందుగుండు వెలిగిస్తారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు



గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయం అందిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భారీ విద్యుత్ లైటింగ్, స్టేజ్ ప్రోగ్రాంలు, నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. పట్టణ, ట్రాఫిక్ సీఐల ఆధ్వర్యంలో 200 మంది పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

– వాకాడ బాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, అనకాపల్లి

చైనా మాంజాతో వృద్ధుడి ముక్కుకు గాయం

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- బీచ్‌రోడ్డులో సంఘటన
- నిషేధం ఉన్నా ఆగని చైనా మాంజాల విక్రయాలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో చైనా మాంజా తగిలి ఓ వృద్ధుడి ముక్కు కోసుకుపోయింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. కోస్టల్ బ్యాటరీ నుంచి నోవెటెల్ హోటల్‌కి వెళ్లే మార్గంలో శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వెళ్తున్న వృద్ధునికి గాలిపటం ఎగురవేయడానికి ఉపయోగించే మాంజా దారం తలిగింది. దీనిని హెల్మెట్ అద్దం కూడా ఆపలేకపోయింది. పదునైన చైనా మాంజా తగిలి వృద్ధుని ముక్కుప్రాంతంలో గాయమైంది. తీవ్రంగా రక్తస్రావమై వృద్ధుని దుస్తులు రక్తంతో తడిసిపోయాయి. వెంటనే స్థానికులు స్పందించి బాధితుడికి సపర్యలు చేసి, ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడు వాహనంపై నెమ్మదిగా వెళ్లడం, హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసుల వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.



గాయపడిన వృద్ధుడు

ప్రమాదకరం...చైనా మాంజా...

ప్రమాదకరమైన చైనా మాంజాపై నిషేధం ఉంది. పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగించే దారానికి సన్నని గాజు పొడిని పూస్తారు. గాలిపటాల పోటీలు జరిగే సమయంలో వేరొకరి గాలిపటం దారాన్ని కత్తిరించడానికి దీనిని వినియోగిస్తారు. గతంలో ఈ చైనా మాంజా కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ చైనా మాంజాపై నిషేధం ఉంది. వీటిని విక్రయించొద్దని పోలీసులు వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. అయినప్పటికీ విక్రయాలు కొనసాగుతున్నాయి.



ప్రమాదానికి కారణమైన చైనా మాంజా కలిగిన గాలిపటం

మలేరియా నిర్మూలనకు చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో పూర్తిస్థాయిలో మలేరియా నిర్మూలించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు సంబంధించి గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ అందజేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఫీవర్ కేసులు సంభవించకుండా ఎప్పటికప్పుడు ఇంటింటి సర్వే చేయాలన్నారు. పీహెచ్‌సీల నుంచి రంపచోడవరం, కాకినాడ, రాజమహేంద్రవరం రిఫర్ కేసులను సంబంధిత ఏఎన్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. పీహెచ్‌సీకి జ్వరాలతో వచ్చిన వారికి రక్త పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేయాలన్నారు. ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలను వైద్యాధికారులు సందర్శించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ హాల్‌కు ప్రసవాలు కోసం వచ్చిన గర్భిణులకు ప్రసవం అయ్యే వరకు వైద్యుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ నెల 20 నుంచి లెప్రసీ కేసులు గుర్తించేందుకు ఏడు మండలాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు శేషురెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైద్యాధికారులు

గిరిజన గ్రామాల అభివృద్ధికి సీఆర్‌పీఎఫ్ భాగస్వామ్యం

సీలేరు: గిరిజన గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు సీఆర్పీఎఫ్ భాగస్వామి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ఇందుకోసం ప్రజల సహకారం అందించాలని సీఆర్పీఎఫ్ పీఎఫ్ జీ–42 బెటాలియన్ డీఎస్పీ ఎ.సందీప్ రెడ్డి కోరారు. సీలేరు సీఆర్పీఎఫ్ జీ 42 బెటాలియన్ డీఎస్పీగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం స్థానిక గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్ పీఎఫ్ బలగాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అసాంఘిక శక్తుల వలన ప్రజలకు ఎటువంటి హానీ జరగకుండా చూడడమే తమ బాధ్యత అన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. పోలీసుస్టేషన్ పరిధిలోని స్థానిక ప్రజలు పోలీస్, సీఆర్పీఎఫ్‌తో స్నేహభావంతో మెలిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ నెలాఖరులోగా సీఆర్పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, వైస్ సర్పంచ్ కె.వల్లీ ప్రసాద్. మాజీ వైస్ సర్పంచ్ కారే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సందీప్‌రెడ్డి

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

- ఉమ్మడి విశాఖ జిల్లా 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

అనకాపల్లి: ఈ ఏడాది మే నెలలో సాధారణ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలో పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉమ్మడి విశాఖ జిల్లా 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, పి.సుదర్శన్. పి.అప్పారావు కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఉపాధ్యాయ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 1998 డీఎస్సీ క్వాలీఫై అయిన ఉపాధ్యాయులకు ఉద్యోగం కల్పించారన్నారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన బదిలీల్లో 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించారన్నారు. వీరంతా 50 సంవత్సరాలు పైబడినవారే కావడంతో ఏజెన్సీలో విధులు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత 62 సంవత్సరాలకు పెంచాలని, 12 నెలల వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ తర్వాత మినిమం పింఛన్ అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏఐసీవోజీలో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ వైద్యుల ప్రతిభ

మహారాణిపేట: ముంబైలో జరిగిన 67వ ఆల్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ జెనెకాలజీ (ఏఐసీవోజీ) సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ విభాగం వైద్యులు,వైద్య విద్యార్థులు అకడమిక్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు గైనిక్ విభాగ వైద్యులను అభినందించారు. జాతీయ కాంగ్రెస్ అకడమిక్‌లో ప్రతిభ కనబరిచిన వైద్యులను ప్రిన్సిపాల్ ప్రశంసించారు. దేశ వ్యాప్తంగా గైనిక్ అధ్యాపకులు పీజీ విద్యార్థులతో సహా దాదాపు వేయి మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పీజీ విద్యార్థులు డాక్టర్ మాధురి నరహరిశెట్టి, డాక్టర్ శ్రీలేఖ చిందిరాల, డాక్టర్ రాగ శ్రీ పాముర్తి, డాక్టర్ రంజిని పెద్దిరెడ్డి, డాక్టర్ షీలు సోనియా గుత్తికొండ, మూడవ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ మాధురి అవార్డులు పొందారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనాకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సి.అమూల్య, డాక్టర్ జి.సామిని, డాక్టర్ జి. శైలజ, డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్ అనురాధ, డాక్టర్ పి.శైలజ మార్గదర్శకత్వంలో పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డాక్టర్ గీతా వందన, డాక్టర్ విద్యా రామ కూడా వార్షిక జాతీయ కాంగ్రెస్‌లో అకడమిక్ ప్రతిభ కనబరిచారు.



ప్రతిభ కనబరిచిన గైనిక్ వైద్యులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

ప్యాకేజీ ఓకే..ఉక్కు భవితేంటి?

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడాన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు. ఈ ప్యాకేజీ రూ.11,440 కోట్లలో రూ.10,300 కోట్లు కొత్తగా ఈక్విటీగా మార్చడానికి, మిగిలిన రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌ను ప్రిఫరెన్షియల్ షేర్లుగా మార్చడానికి వినియోగించనున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న సుమారు రూ.25 వేల కోట్లు భారంలో ఈ ప్యాకేజీ ఎంత వరకు ఉపయోగపడుతుంది, ఈ ప్యాకేజీతో ఉద్యోగులకు, ఉద్యోగులకు చెందిన ఆర్థిక అంశాలకు ఎంత వరకు ప్రయోజనం అవుతుందనే అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఇప్పటికే రెండున్నర నెలల జీతం పెండింగ్‌లో ఉండగా సుమారు రూ.1000 కోట్లు పీఎఫ్ ట్రస్ట్, ఎస్‌బీఎఫ్ ట్రస్ట్, త్రిఫ్ట్ సొసైటీ, ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ తదితర సంస్థలకు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన వీఆర్‌ఎస్ స్కీంకు అవసరమైన సొమ్ము ఈ ప్యాకేజి నుంచి చెల్లిస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్యాకేజీ ద్వారా స్టీల్‌ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధనకు వినియోగించడానికి అందరికీ ఆమోదయోగ్యమే కాని ఇది శాశ్వత పరిష్కారమవుతుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్యాకేజీ వల్ల తాత్కాలిక ఉపశమనమే కాని శాశ్వత పరిష్కారం కాదని కార్మిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం, సెయిల్‌లో విలీనం మాత్రమే శాశ్వత పరిష్కారమని చెబుతున్నారు.



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

పోరాట కమిటీ విజయం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్న కేంద్ర కేబినెట్ కమిటీ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించడం పోరాట కమిటీ విజయం. ఈ ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం కాదు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి, సొంత గనులు కేటాయించాలి, రాష్ట్రపతి పేరిట ఉన్న భూములను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మార్చాలి. అదే విధంగా కొత్త నియామకాలు చేపట్టాలి, నాలుగేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే కల్పించాలి.

– జె.అయోధ్యరామ్, కో–కన్వీనర్ ఉక్కు పోరాట కమిటీ

సొంత గనులు కేటాయించాలి



స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే శాశ్వత పరిష్కారం అవుతుంది. సొంత గనులు లేకపోవడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. ప్యాకేజీ ప్రకటించడం ఆమోదయోగ్యమే అయితే దీని ద్వారా ప్లాంట్‌కు ఏవిధంగా ఉపయోగపడుతుందో పరిశీలించాల్సి ఉంది. ఈ ప్యాకేజి ద్వారా ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధించడంతో పాటు కార్మికుల ప్రయోజనాలు కాపాడతారని భావిస్తున్నాం.

– ఎం.వి. రమణమూర్తి, అధ్యక్షుడు, స్టీల్ ఐఎన్‌టీయూసీ

సెయిల్‌లో విలీనంతోనే పూర్తి పరిష్కారం

కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడం పోరాట కమిటీ స్వాగతిస్తోంది. అయితే ఈ ప్యాకేజీ వల్ల పూర్తి పరిష్కారం లభించదు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం చాలా ముఖ్యమైన అంశం. అదే విధంగా ఈ ప్యాకేజీ ద్వారా కార్మికులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు వెంటనే కల్పించాలి.

– కె.ఎస్.ఎన్.రావు,కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

ప్రజాచైతన్యమే లక్ష్యం

- ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు

కూనవరం: ఏజెన్సీ ప్రాంతాల్లో పజలను చైతన్య పరచడమే తమ లక్ష్యమని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజానాట్యమండలి ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను వారి సమస్యలపై పోరాడేందుకు కళారూపాల ద్వారా చైతన్య వంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోడె సుమన్, కారం కన్నారావు, హరీష్, వసంత్, కామేష్, మారయ్య, ప్రజా సంఘాల నాయకులు బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీను, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టాఫ్ నర్సుల పోస్టుల దరఖాస్తుల గడువు

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఆఫ్‌లైన్‌లో 8,250 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ కూడా దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేస్తున్నారు. పూర్తి వివరాల కోసం https@// nagendrasvst. wordpress. com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

మద్దతు ధర కోసం జీడి రైతుల పాదయాత్ర

రావికమతం(చోడవరం)/దేవరాపల్లి: జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించడంతోపాటు ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రావికమతం మండలం నేరేడు బంద నుంచి అజయ్‌పురం వరకూ జీడిమామిడి రైతులు ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి ఆందోళన నిర్వహించారు. జీడితోటల మధ్య నుంచి వీరు పాదయాత్ర చేశారు. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీలో స్థానిక గిరిజన జీడి రైతులతో కలిసి సీపీఎం నేత వెంకన్నశుక్రవారం జీడి పంటలను పరిశీలించారు. వెంకన్న మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడికి మాత్రం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. దీనిని ఆసరాగా తీసుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాయితీలను పునరుద్ధరించాలని, ఉపాధి హామీ పథకంలో జీడి తోటల అభివృద్ధికి ఎకరాకు రూ.9 వేల చొప్పున అందజేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంక్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, డి. శంకర్, డి.సోమయ్య, మామిడి దేముడు, సిహెచ్. ఎరకయ్య, సోముల కృష్ణ, డి. నారాయణ, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య' దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి

ఎంవీపీకాలనీ: జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలోని ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుకు శనివారంతో గడువు ముగియనుంది. ప్రొటెక్షన్ ఆఫీసర్ 1, డాక్టర్ (పార్ట్‌టైం) 1, ఆయా 1 పోస్టులకు ఇటీవల ఆ శాఖ దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 2024 జూలై ఒకటో తేదీ నాటికి 25 ఏళ్లు నిండి, 42 ఏళ్ల లోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత గల అభ్యర్థులు htpp:// visakha patnam. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను పొందవచ్చు. శనివారం సాయంత్రం 5 గంటలలోపు అర్హులు వారి దరఖాస్తులను ఎంవీపీ కాలనీ సెక్టార్–9, డీఆర్‌డీఏ కార్యాలయంలోని జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో అందజేయాలి.

మూడు నెలల్లో 30,440 లీటర్ల పులుపు ధ్వంసం



సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నర్సీపట్నం: ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా తో నర్సీపట్నం సర్కిల్ పరిధిలో సారా నిర్మూలనకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాల్లోని సారా బట్టీలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. పెదబొడ్డేపల్లి, పెదపేట కొంతలం, ధర్మసాగరం తదితర గ్రామాలపై గట్టి నిఘా పెట్టారు. సారాతో పట్టుబడిన నిందితుడిపైనే కాకుండా తయారీదారులపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. సారా తయారీకి మూలమైన నల్లబెల్లం విక్రయాలు అధికంగా జరిపిన వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ మూడు నెలల కాలంలో 112 కేసులు నమోదు చేసి 115 మందిని అరెస్టు చేశారు. 114 లీటర్ల సారాను సీజ్ చేశారు. 30,440 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. 113 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.